# అడకత్తెరలో

రోడ్డు కొలుస్తుందా అన్నట్టున్నాయి రాధారాణి అడుగులు. చేతిలో పర్సు తప్ప మరేం లేవు.

ఒకసారి వచ్చి వెళ్ళమని వాళ్ళబ్బాయిచేత విమల నిన్న కబురంపింది. నిన్న కుదర్లేదు .... ఎందుకో ఏవిటోనని ఇవాళైనా వెళ్లకపోతే బాగుండదని వెళ్ళింది. ఇంతా చేస్తే విమల రమ్మన్నదానికి కారణం చీరలు .... వాళ్ళ ఊరెళ్ళి వచ్చిందట. అక్కడనించి అయిదారు పుల్లేటికుర్రు చీరలు తెచ్చిందట.

"నువ్వొకటో రెండో తీసుకుంటావేమో చూస్తావని రమ్మన్నాను."

సరే ఇప్పుడు తను కొత్త చీరలు కొనుక్కునేట్టే వుంది. పైన పటారం లోన లొటారం కాపరం. మింగనూలేదు, కక్కనూలేదు ఇంతా చేస్తే పెళ్లయి ఏడాది.

"నువ్వు నీకు నచ్చినవి తీసుకున్నాకే మిగిలినవి మా పక్కింటి వాళ్ళకి చూపిస్తాను. వాళ్ళకీ కావాలంటే తీసుకుంటారు."

ఏవిటా ధైర్యం ? ఎవరూ తీసుకోకపోతే ఏం చేస్తుంది ? ఏ ధైర్యం మీద తెచ్చినట్టూ అన్ని చీరలు తనకే నష్టం అన్ని చీరలూ తనే ఉంచేసుకోవల్సివస్తుంది అక్కర్లేకపోయినా. ఏ నెల కా నెల బొటా బొటీగా గడిచే సంసారం పైగా.

" ఇప్పుడు నేనేమీ చీరలు తీసుకోను విమలా "

విమల మొహం మాడిపోయింది " అదేమిటి ? ఆ మధ్య నేను మీ ఇంటికి కట్టుకొచ్చిన ఎర్ర చారల పుల్లేటికుర్రు చీర బావుందన్నావు కదా. అందుకని నువ్వు ఖచ్చితంగా తీసుకుంటావన్న ఉద్దేశంతో నిన్నడగకుండానే తీసుకొచ్చాను. ఎరుపు రంగులో కూడా. ఎరుపురంగు మా పక్కింటావిడ కట్టదు. నాకేమో ఉండనే ఉంది. ఆ రంగులో - నువ్వు తీసుకోనంటే ఇప్పుడు నేనేం చెయ్యనది ? "

అసలే మనసేమీ బాగులేని రాధారాణికి ఏడవాలో, నవ్వాలో తెలియలేదు. చీరలు తెచ్చిపెట్టమనీ, కొనుక్కుంటానని తనేం చెప్పలేదే ఎప్పుడూ ! తప్పు తనదన్నట్లుగా మాట్లాడుతుందేవిటి ?

తన కక్కర్లేకపోయినా, చీరలేం ఇప్పుడు కొనుక్కోదల్చుకోక పోయినా పోనీలే లేనిపోని గొడవెందుకని ఆ ఎర్రరంగు చీర తీసుకుందా మనాన్న భర్త దగ్గిర తనకు మొహంచెల్లద్దూ ? ఆయనతో చెప్పకుండా ఎలా ? ఏ మొహం పెట్టుకుని డబ్బడగాలి ఆయన్ని ? తుమ్మితే ఊడే ముక్కులా ఉంది కాపరం - తగుదునమ్మా అంటూ కొత్త చీరలు కొనుక్కుందుకు మనసొప్పద్దూ ?

మాడ్చుకున్న మొహంతోనే కాఫీ కలిపిచ్చింది విమల. చల్లగా చప్పగా ఏడ్చినట్టే వుంది కాఫీ కూడా.

కాసేపు కూచొని అన్యమనస్కంగానే నాలుగు మాటలు మాట్లాడి ఇంక వెళ్తానని చెప్పి వచ్చేసింది. అడుగులు నీరసంగా వేస్తూ వచ్చి,

బస్సుస్టాప్‌లో నిలబడి పర్సు లోంచి రుమాలుతీసి నుదిటిమీద చెమట తుడుచుకుంది.

*

కాలంతో పోటీ పడుతున్నట్టున్నాయి శేఖర్ అడుగులు.

నిండుగా వున్న ఫైర్‌బ్యాగ్ వుంది చేతిలో.

బస్‌స్టాప్ కొచ్చి నిల్చుంటూనే రాధారాణిని చూశాడు, అంతే. కనుబొమ్మలు ముడుచుకున్నాయి. కళ్ళల్లో ఏవేవో ప్రశ్నలు కదలాడాయి. శేఖర్ని చూస్తూనే రాధారాణి మొహంలో కూడా రంగులు మారాయి.

" మీరు - మీరు - ఈ ఊళ్లో ఉంటున్నారా ? "

ముందుకీ, వెనక్కీ తల ఊగించింది అతనడిగిన ప్రశ్నకి జవాబుగా. తర్వాత తనూ ప్రశ్న వెయ్యకుండా వుండలేకపోయింది.

" మీరూ ఈ ఊళ్లో వుంటున్నారా - మీరొక్కరేనా " అంతకు మించి ఆ ప్రశ్నని వివరంగా అడగడానికి మొహమాటం అడ్డొచ్చింది.

" నాకీ ఊళ్లో ఉద్యోగం వచ్చింది-నెల్లాళ్ళయింది నేనీ ఊరొచ్చి. మొదట నే నొక్కడినే వచ్చాను - కానీ. అన్నయ్యనీ ఊళ్లో హాస్పిటల్లో ఎడ్మిట్ చెయ్యాల్సొచ్చి అన్నయ్యనీ, అమ్మనీ వారం రోజుల క్రిందట తీసుకొచ్చాను - ఆ రోజే ఎడ్మిట్ చేసేశాం అన్నయ్యని. ఇప్పుడు హాస్పిటల్‌కే వెళ్తున్నాను నేను. నేను వెళ్ళి అమ్మనింటికి పంపించాలి "

ఒక్క క్షణం గుండె ఆగిపోయినట్టయింది రాధారాణికి. "ఏమైంది? మనోహర్ కేమైంది ? ఎందుకు ఎడ్మిట్ చేశారు ? "

" ఆరోగ్యం బొత్తిగా పాడైపోయింది. ఇవాళో రేపో అన్నట్టున్నాడు " శేఖర్ గొంతు బొంగురుపోయింది.

రాధారాణి గుప్పెట్లో పర్సు గట్టిగా బిగుసుకుంది. రెండో చేయి గుండెలమీదకి వెళ్ళింది. భయంతో, బాధతో పెదవులు వణికాయి.

ఏదో అడగబోయి అడగలేక పోతోందని ఆమెవంకే చూస్తుండి పోయాడు శేఖర్.

" నేనూ వొస్తాను మీతో హాస్పిటల్‌కి – మనోహర్ని చూడాలి "

" ఇప్పుడొస్తారా ? హు – " విరక్తిగా నవ్వాడు.

" మీ వల్లకాదూ అన్నయ్య ఈ స్థితిలో ఉన్నది ? "

" శేఖర్‌గారూ – " రాధారాణి గొంతులో ఆశ్చర్యం.

" ఔను – మీ పెళ్ళయిపోయిందని తెల్సిన రోజునించే అన్నయ్య వాలకం మారిపోయింది. అంత పిచ్చిగా మిమ్మల్ని ప్రేమించిన అన్నయ్యని కాదని ఎలా అనగలిగారా అని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాన్నేను నేనూ, అమ్మా ఇద్దరం అన్నయ్యలో మార్పు తీసుకురావాలని చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమే అయ్యాయి. తిండి సరిగ్గా తినడు. వేళకి నిద్రపోడు, గదిలో ఇరవై నాలుగ్గంటలూ మీ ఫొటో ఎదురుగా పెట్టుకూర్చుని ఆలోచిస్తూ, చేతిలో గ్లాసు నింపుకుంటూ వుండడమే పని. ఎవరితో మాట్లాడడు. పలకరిస్తే ముక్తసరిగా ఆ, ఊ అంటాడు. అలా అలా ఆరోగ్యం బొత్తిగా పాడైపోయింది. మీ పెళ్ళయిపోయిందని తెలిశాకే అన్నయ్య మనసెంత బలహీనమో తెల్సింది మాకు. "

మనో.....మనో.....మనో.....రాధారాణి చెవుల్లో ఆ పేరు మారు మోగుతోంది. రోడ్డుమీది రకరకాల వాహనాల శబ్దాలుగానీ, చుట్టుపక్కల మనుషుల మాటలుగానీ ఏవీ వినపడటంలేదు. ఎదురుగా ఏవీ కనపడటం లేదు. మనోహర్ రూపమే కంటిముందు నిలిచింది.

*

"మనో..." అరచేతిలోకి యిసక తీసుకుని నెమ్మదిగా జారవిడుస్తూ కెరటాలకేసి చూస్తోంది రాధారాణి.

" మనో. "

*

" మాట్లాడవేం మనో ? "

" నీ చేత మళ్ళీ మళ్ళీ పిలిపించుకోవాలని. "

" ఎందుకో ? " నిర్మలత్వం, అమాయకత్వం నింపుకున్న రాధారాణి కళ్ళు రెపరెపలాడాయి.

" నీ పిలుపు నా చెవులకెంత ఇంపుగానో వుంటుంది. అందుకే మళ్ళీ మళ్ళీ నీ నోట నా పేరు వినాలని..."

" ఊఁ.. వినాలని ? "

" మాటలురాని మూగవాడిలా చూస్తూ కూచుంటాను. "

" సరిపోయింది సంబరం—నువ్వలా చేస్తే ఆయనగారికి బ్రహ్మ చెముడేమో అని అనుమానపడాల్సొస్తుంది నేను." వేళాకోళం, విసుగూ మిళితమయ్యాయి రాధారాణి గొంతులో.

అదేమీ పట్టించుకోని మనోహర్ రాధారాణి కళ్ళల్లోకి చూస్తూండి పోయాడు—ఎంత నిర్మలంగా ఉన్నాయా కళ్ళు !...ఎంత అమాయకత్వం నిండివుంది ఆ కళ్ళల్లో !

*

" రాధా "

" ఊఁ "

" రేపు నాతో సినిమాకి రావాలి నువ్వు "

" సినిమాకా ? "

" కాదనకు...రేపు నా పుట్టినరోజు. "

" హాయ్ నిజంగా...అయితే వస్తాలే. పుట్టినరోజు పిల్లాడిని నొప్పించటమెందుకు ? సరే, పుట్టినరోజు సందర్భంగా బహుమతి ఏం కావాలో కోరుకో. "

" నిజంగా ఇస్తావా ? " మనోహర్ కళ్ళల్లో మెరుపు గమనించలేదు రాధారాణి.

" ఏం అంత ఆశ్చర్యపోతున్నావు ? "

" అబ్బే మళ్ళీ మాట తప్పుతావేమోనని "

" తప్పడాల్లేవు, తిప్పడాల్లేవు, అప్పడాలే వున్నాయి బజార్లో. " కిలకిలా నవ్వింది.

" నీ ఫొటో ఒకటి యివ్వు... "

" ఓస్...దీనికేనా ? ఇస్తాలే రేపు, సరళ కూడా అడిగింది నా ఫోటో. దానికీ యిస్తానని చెప్పాను..."

" రేపేం సినిమాకి వెళ్దాం ? "

సడన్‌గా అప్పుడు గుర్తొచ్చింది రాధారాణికి. ఆరోజు ఫస్టుషోకి తనూ, సరళా, సరళావాళ్ళన్నయ్యా వెళ్దామనుకున్న సంగతి.

" ఏదో ఒకటి. రేపు ఆలోచించుకోవచ్చులే. ఇప్పుడు నేను అర్జంటుగా పోవాలి. వస్తాను మరి " అదరా బాదరా సరళా వాళ్ళింటికి బయల్దేరింది.

*

తన రాక తెలియజేస్తూ చిన్నగా దగ్గాడు శేఖర్.

ఒడ్డును తాకి విరిగిపడుతున్న అలల్ని ఏకాగ్రతతో చూస్తున్న రాధారాణి తల పక్కకి తిప్పింది.

" ఓ...మీరా ? " ఇటూ, అటూ కళ్ళతో వెదికింది మనోహర్ కూడా వచ్చాడేమోనని-లేడు.

" మీ అన్నయ్య రెండ్రోజులుగా క్లాసెస్ ఎగ్గొడుతున్నారేం ? "

" అన్నయ్యకి రెండు రోజుల్నించీ బాగా జ్వరంగా వుంది. "

" అయ్యో పాపం...ఇవాళ కూడా ఎక్కువగానే వుందా ? "

" ఎక్కువగానే వుంది. "

" పదండి. మీ కభ్యంతరం లేకపోతే మీ రూమ్‌కి తీసికెళ్ళండి పాపం ! అతన్ని ఒంటరిగా రూమ్‌లో వొదిలేశారా ? " లేచి చీర కంటుకున్న యిసక దులుపుకుంది.

" అన్నయ్యకి జ్వరంగా వుందని మాట మాత్రంగా మీ దగ్గర అంటే తప్పకుండా తనని చూడటానికి వొస్తారనీ, ఈవేళప్పుడు మీరిక్కడ వుంటారనీ అన్నయ్య చెప్తేనే ఇలా వొచ్చాను-మిమ్మల్ని వెదుకుతూ..." ఈ మాటలన్నీ శేఖర్ గొంతులోనే వుండిపోయాయి. మౌనంగా అడుగు ముందుకి వేశాడు.

తామున్న గది చూపించి, తను ఇవతలే ఆగిపోయాడు.

రాధారాణిని చూస్తూనే మనోహర్ మొహం వికసించింది. లేవబోయాడు మంచమ్మీదనుంచి.

" లేవకు మనో...పడుకో...ఎలా వుంది ? " స్టూల్ గోడవారగా లాక్కొని కూర్చుంది.

" నాకు తెల్సు...నాకు ఒంట్లో బాగులేదని తెలిస్తే నువ్వు తప్పక నన్ను చూడటానికి వొస్తావని నాకు తెల్సు...నా ఊహ తప్పలేదు " మనోహర్ గొంతులో ఆనందం సుళ్ళు తిరిగింది

దానిదేముంది ? ఫ్రెండుకి ఒంట్లో బాగులేదని తెలిస్తే చూడటానికి వెళ్తాం....ఇందులో గొప్పేముంది. ఈ మాత్రం ఎవరైనా ఊహించ గలరు. అందుకే అతని మాటకేం జవాబివ్వలేదు.

తన ధోరణిలో తను అడిగింది. " ఏం తీసుకున్నావు ఇవాళ ? వొట్టి కాఫీయేనా ? "

రాధారాణి మొహంలోకే చూస్తున్న మనోహర్‌కి జ్వరం గిరం ఎగిరిపోయినట్లుగా ఎంతో రిలీఫ్‌గా వుంది.

" ఆ ఫ్లాస్కులో కాఫీ వుంది. నీ చేత్తో ఇవ్వు " కిటికీలోవున్న ఫ్లాస్కువంక చూపించి గునిశాడు.

పక్కనేవున్న రెండు గ్లాసుల్లో ఒకదాంట్లో ఫ్లాస్కులో కాఫీ పోసి అందించింది.

" నువ్వు కూడా తీసుకోవాలి ఇద్దరం చెరి సగం తీసుకుందాం. ఆ రెండో గ్లాసిలా యియ్యి. అందులో సగం పోస్తాను. "

" ఊహూ....నా కొద్దు " నిక్కచ్చిగా చెప్పింది.

" ఇదే మొట్టమొదటిసారి నువ్వు మా రూమ్‌కి రావడం. అతిథి మర్యాద చెయ్యకపోతే నా మనసు పీకుతుంది. ఇద్దరం చెరి సగం తాగుదాం. మళ్ళీ కాసేపట్లో ఫ్లాస్కునిండా తీసుకొస్తాడు శేఖర్. "

" కాఫీ లేదనీ కాదు, మళ్ళీ తీసుకురారనీ కాదు. నా కా ఫ్లాస్కు వాసన గిట్టదు. నన్ను తాగమనద్దు" మరింత ఖండితంగా చెప్పెయ్యడంతో కొంచెం చిన్నబుచ్చుకున్నాడు మనోహర్.

" అరె....ఇది కొత్తగా వేశావా ? చాలా చాలా బావుంది.... నిజంగా నువ్వు బొమ్మలు చాలో బాగా వేస్తావు మనో ..." నిర్మలమైన

రాధారాణి మనసు చిన్నపిల్లలా సంబరపడింది. అమాయకత్వాన్ని నింపుకున్న ఆ కళ్ళు అతను వేసిన బొమ్మనే దీక్షగా చూస్తున్నాయి.

చిన్నబుచ్చుకున్న మనోహర్ మొహం మళ్ళీ కళకళలాడింది. తను వేసే బొమ్మలు రాధ మెచ్చుకుంటే ఎంత ఆనందంగా వుంది.

ఎంతమందో తను వేసే బొమ్మలు చూసి మెచ్చుకున్నారు కానీ ఈ తృప్తీ, ఈ ఆనందం మరెవరి మెచ్చుకోలుకీ కలగలేదు తనలో. రాధారాణి కళ్ళల్లోకి తదేకంగా, ఎంతో ఆరాధనగా చూస్తూండిపోయాడు.

*

" రేపే నన్నమాట నీ ప్రయాణం ? "

" ఊ....నువ్వెప్పుడూ మీ ఊరు బయల్దేరేది ? "

" రెండు మూడు రోజుల్లో....అది సరేగాని రాధా__మ__"

" ఊ మరి ? "

" మరి__మరి. "

" ఏవిటి ? " ఎందుకంత నాన్చుడో ఏవీ అర్థంకాలేదు రాధారాణికి.

" మరి మనసులో మాట బయటపెట్టకుండా ఆగాను ఇన్నాళ్ళూ. పరీక్షలయ్యేదాకా ఓపిక పట్టాలని. నువ్వు ఎప్పుడూ నోరువిప్పి చెప్పక పోయినా నీ మనసులోనూ అదే వుందని నాకు తెల్సులే. ఆడదాని కాబట్టి సహజంగా ఆ ప్రస్తావన తీసుకురావడానికి నువ్వు సిగ్గుపడతావు."

" అబ్బబ్బ....ఏవిటి మనో. దేన్ని గురించీ నువ్వు మాట్లాడేది ఒక్క ముక్క అర్థం కావట్లేదు నాకు. " ఏ కల్మషంలేని ఆ మనసుకి నిజంగానే ఏమీ అంతుపట్టలేదు. అమాయకమైన ఆ కళ్ళు రెపరెపలాడాయి.

" దొంగా ! ఏమీ తెలియనట్లు యెంత నటన ? నా మనసు దొంగిలించిన ఈ దొంగకి శిక్ష ఏమిటో తెల్సా ? " రాధారాణి భుజాలమీద చేతులు వేశాడు.

తెల్లబోయింది. అతని చేతుల్ని విసురుగా తోసింది.

ఇన్నాళ్ళ స్నేహంలో అతను తనని యెప్పుడూ ముట్టుకోలేదు. ఇప్పు డిదేవిటీ ? ఈ మాటలకీ, ఈ చేతలకీ అర్థం ఏమిటి ? మరు నిమిషంలోనే రాధారాణి మొహం పాలిపోయింది.

ఎంత తప్పుగా అర్థంచేసుకున్నాడు తనని.

సరళావాళ్ళ అన్నయ్యతో కూడా తను చనువుగానే వుంటుంది.... మరి....అతనిలా అర్థంచేసుకోలేదే తనని !....

" మనో....నన్ను క్షమించు....మన స్నేహాన్ని నువ్విలా అర్థం చేసుకుంటావని నే ననుకోలేదు. తెలివితేటలు, మంచి అలవాట్లూ, క్రమశిక్షణా అన్నీ నీలో వున్నాయని నువ్వంటే గౌరవం, అభిమానం వున్నాయి నాకు. ఆ అభిమానంతోనే నీతో చనువుగా వున్నాను. నాకున్న కొద్దిమంది ఫ్రెండ్సులో సరళా, సరళావాళ్ళన్నయ్యా, నువ్వూ కూడా వున్నారు. మీ ముగ్గురితోనూ ఒకేలా మసులుకున్నాన్నేను. ఒక మంచి స్నేహితుడిగా నీకు నా మనసులో స్థానముంది. నీ మనసులోనూ నా కదే స్థానమిచ్చావని అనుకున్నాను - నన్ను క్షమించు "

" రాధా - " మనోహర్ గుండె ముక్కలైంది.

నమ్మలేనట్టు వింతగా చూశాడు.

" హాస్యాలాడకు రాధా-భరించలేను. నీ " మనో " అన్న పిలుపుకి ఎంత పొంగిపోతానో తెల్సా ? "

" ఉన్నమాటంటే హాస్యాలంటావేమిటి ? "

మనో అన్న పేరు తనకి చాలా ఇష్టమైనదైనందువల్ల చనువుగా " మనో " అనే పిలుస్తూ వొచ్చింది. అది కూడా తప్పేనా ? ప్రేమిస్తే తప్ప స్నేహితుడిని అలా పిలవకూడదా ? మనసు బాధగా మూలిగింది.

" కాదు రాధా కాదు. ఇప్పుడన్నమాట అబద్ధం అని చెప్పు. నన్ను ప్రేమించానని ఒక్కమాట చెప్పు. చెప్పు రాధా "

జాలిగా అతనివంక చూసింది " నన్ను క్షమించు మనో. నా కా వుద్దేశం లేనిదే అబద్ధం ఎలా చెప్పను ? నే నెప్పుడన్నా హద్దులు మీరి ప్రవర్తించానా నీతో ? చనువుగా వున్నంత మాత్రాన మరోలా అర్థం చేసుకున్నావు ఒక మంచి స్నేహితుడిగా నా మనసులో నీకెప్పుడూ స్థానం వుంటుంది. వెళ్ళొస్తాను "

*

తియ్య తియ్యని కలలు కంటూ కాపరానికొచ్చింది రాధారాణి.

ఆర్నెల్లు ఓ మాదిరిగా గడిచాయి. ఆ తర్వాత సరియైన నిద్రంటే ఏమిటో మర్చిపోయింది కడుపునిండా తినడం అన్నది అసలే పోయింది. మనశ్శాంతికి దూరమైంది. వీటన్నిటికీ కారణం భర్త శేషగిరి ప్రవర్తనే. ఆ ప్రవర్తన ఆరంభమైంది అతనడిగిన " ఎవడినో ప్రేమించావటగా కాలేజీలో ? " అన్న ప్రశ్నతో.

" ఎవడు వాడు ? " చేతిలో సిగరెట్టు చివరి దశలో వుంది.

" ఎవరు ? "

" అదే నువ్వు ప్రేమించినవాడు " పేకాటలో ఓడిపోయి వచ్చిన విసుగు కూడా తోడైంది.

" నే నెవరినీ ప్రేమించలేదు "

" నీ అబద్ధాలు నమ్మడానికి నేనేం అమాయకుడిని కాదు. నాకన్నీ తెల్సిపోయాయి. " సిగరెట్టు కిందపడేసి చెప్పుతో రాశాడు. భర్త కళ్ళల్లో ఎరుపుజీర చూసింది అయినా భయపడలేదు.

" ఏం తెలిశాయి ? "

" నువ్వు దాచిపెట్టిన నీ రహస్యాలు "

" నేనేం దాచిపెట్టాను ? వొద్దనుకున్నా గొంతులో చిరాకు ధ్వనించక తప్పలేదు.

కాళ్ళమీద పడాల్సిందిపోయి, అఫ్టరాల్ ఆడది ఎదురు ప్రశ్నలు వెయ్యడమా ? తన డిగ్నిటీకే భంగం కాదూ ?

మనసులో కోపాన్ని చెయ్యి చూపించింది.

రాధారాణి చెంప ఛెళ్ళుమంది.

" ఏమిటా ఎదురు ప్రశ్నలు ? తప్పు నీదై ఉండి కూడా "

చెంప తడుముకుందే కానీ, మనసు తడుముకోలేదు రాధారాణి.

" నేనే తప్పుడు పన్లూ చెయ్యలేదే ? "

శేషగిరి పిడికిళ్ళు బిగిశాయి. కళ్ళు మరింత ఎరుపుని పులుము కున్నాయి. ఎడం చేత్తో జుట్టు పుచ్చుకుని ముందుకి లాగాడు.

" నీ ప్రేమ వ్యవహారం దాచిపెట్టి నా చేత మూడుముళ్ళూ వేయించుకోడం నేరం కాదూ ; అది నాకు తెల్సిపోయిందని చెప్తున్నా కూడా ఏమీ ఎరగని అమాయకురాల్లా నటించడం ఇంకా పెద్ద నేరం - భయం లేకుండా ఎదురు ప్రశ్నలు వెయ్యడం "

" నేనే పాపం చెయ్యనప్పుడు ఎందుకు భయపడాలి ? "

" హుం. బరితెగించిన దానివి నీకు భయమెందుకుంటుందీ ? చెప్పు ఎవడు నీ ప్రియుడు ? ఎక్కడున్నాడిప్పుడు ? ఎందుకు పెళ్ళి చేసుకోలేదు నిన్ను ? నీ గుణం మంచిదికాదు పొమ్మన్నాడా ? " మాటల్లో వెటకారం గొంతులో కోపం.

నే నెవర్నీ ప్రేమించందే ఎవరని చెప్పను? పెళ్ళయ్యాక మిమ్మల్ని ప్రేమించడమే నాకు తెల్సు అదివరకు ఎవర్నీ ప్రేమించలేదు. పెళ్ళి చేసుకోవాలనుకోలేదు "

" హు - నిజం నువ్వెందుకు చెప్తావు ? నాలుగు తగల్నిస్తే "

" నే నెవర్నో ప్రేమించానని నా గురించి లేని మాటలు మీ చెవిని యెవరు వేశారో వాళ్ళనే అడగలేకపోయారా వాడెవడని ? "

రాధారాణిలో సహనం సన్నగిల్లింది.

ఈ జవాబు శేషగిరి అనుమానాన్ని, కోపాన్ని మరింత యెక్కువ చేసింది.

*

రోజులు గడిచిపోతున్నాయి.

రాధారాణికి జీవితమ్మీద విరక్తి పెరిగిపోతోంది.

భర్త పెట్టే చిత్రహింస రోజురోజుకీ అధికమైపోతోంది.

పెళ్ళికి ముందు యెవరినో ప్రేమించినట్టు అతన్నే పెళ్ళి చేసుకోవాలని అనుకున్నట్టూ వొప్పుకోవాలిట. ఇదెక్కడి విచిత్రం ? అర్నెల్లి క్రిందట పండక్కి వూరెళ్ళినప్పుడు అక్కడ ఎవరో తన గురించి ఈయన దగ్గిర యేదో వాగి ఉంటారు - అదే అయి ఉంటుంది కారణం. స్నేహంలో తానెక్కడా హద్దులు మీరింది లేదు. స్నేహానికీ, ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకోడానికీ తేడా లేదూ ? ఎంత చెప్పినా అర్థం చేసుకోని భర్తని ఎలా నమ్మించాలి ? ఏం చెప్పి నమ్మించాలి ?

" నువ్వే మొండిదానివీ, పట్టుదల గలదానివీ అనుకుంటున్నావేమో నిన్ను మించిన మొండివాడీ శేషగిరి - ఏదో ఒకరోజు నీ నోట్లోంచి నిజం బయటపడకపోదు - ఆ రోజు - ఆ రోజు నిన్ను నరికి ముక్కలు చేయకపోతే నా పేరు శేషగిరే కాదు " పిచ్చికోపంతో శపథం చేశాడు ఒక రోజు.

రాధారాణి గుండెల్లో వేదన కళ్ళల్లోకి చిమ్మింది.

ఇదా తను కలలు కన్న సంసార జీవితం ?

భగవంతుడా ఇలాటి జీవితం ప్రసాదించే కంటే నన్నసలు పుట్టించకుండా వుంచేనే బావుండేది కదా !

రోజు రోజూ చిత్రహింసననుభవిస్తూ, మానసికంగా నలిగిపోతూ పైకి మటుకు నవ్వుతూ ఇతరుల ఎదుట దాంపత్య జీవితం సుఖంగా సాగిపోతున్నట్టు నటిస్తూ ఏడాది నెట్టుకొచ్చింది.

*

"ఈ బస్సు వెళ్తుంది హాస్పిటల్‌కి. మీరు కూడా వస్తానన్నారుగా. ఎక్కండి" శేఖర్ పిలుపుతో ఆలోచనల్లోంచి తేరుకుంది రాధారాణి. మౌనంగా బస్సెక్కి కూర్చుంది. మనోహర్ మీద జాలితో మనసు మూగవీణే అయింది.

"ఇలా రండి—ఈ గది—" శేఖర్ వెంట స్పెషల్‌రూమ్‌లోకి నడిచింది. అడుగులు తడబడుతూ, గుండె లదురుతూ లోపల అడుగు పెట్టింది, కళ్ళుమూసుకుని పడుకుని వున్నాడు మనోహర్.

అయ్యో ! ఎలా వుండేవాడు ఎలా అయిపోయాడు....మనిషిలో జీవకళే లేదే ? మనో....నువ్వేనా ? నువ్వేనా మనో....నీ మనసింత బలహీనం అని నాకు తెలియదు మనో....నాకు తెలియదు.

మంచానికొంచెం దూరంలో స్టూల్‌మీద కూర్చుని కళ్ళుతుడుచుకుంటున్న తల్లి దగ్గరికి నడిచాడు శేఖర్. "అమ్మా."

"నాకు కాళ్ళూ, చేతులూ ఆడటంలేదురా. ఇందాక నర్సువొచ్చి చూసి హడావిడిగా వెళ్ళి పెద్ద డాక్టరుగార్ని తీసుకొచ్చింది. ఆయన పరీక్షచేసి ఏదో ఇంజక్షను చేశారు. ఇద్దరూ ఏదో మాట్లాడుకున్నారు.

నా కర్థం కాలేదు కానీ, వాళ్ళ మొహాలు చూస్తే నా కనుమానం వేసింది. నేను భయపడతాననో ఏమో నాకేం చెప్పలేదు. నువ్వెప్పుడొస్తావని నీ గురించి అడిగారు. " ఏడుపు మరి ఆపుకోలేకపోయిందావిడ.

" నువ్వు కంగారుపడకు. నే నెళ్ళి పెద్ద డాక్టర్‌గారితో మాట్లాడి వస్తాను " పరుగులాంటి నడకతో బైటకి వెళ్ళిపోయాడు శేఖర్.

" హలో శేఖర్ నువ్వూ మోహన్‌ని చూడటానికొచ్చావా హాస్పిటల్‌కి ? " కొలీగ్ మోహన్‌ని పరామర్శించి తిరిగి వెళ్ళిపోబోతున్న శేషగిరి, కొత్తగా తమ ఆఫీసులో జాయిన్ అయిన శేఖర్ని పలకరించాడు.

" మోహన్ కేమైంది ? నాకు తెలియదే ? "

" దేవుడి దయవల్ల ప్రమాదం ఏం లేదులే. మోటర్‌బైక్ మీంచి పడిపోయాడు. చిన్న చిన్న దెబ్బల్తో బతికి బైటపడ్డాడు. మన ఆఫీసు దగ్గరే ఈ హాస్పిటల్ కాబట్టి ఇలా బైటికొచ్చాను. అతన్ని చూసిపోదామని."

" అలాగా ! నా కా సంగతి తెలియదు. నేను నాలుగురోజులబట్టి లీవులో వున్నాను. "

" ఔనౌను. అన్నట్టు లీవులో వున్నావు కదా ! మర్చిపోయాను. ఏవిటి సంగతి ? ఎవరికి ఒంట్లో బాగులేదూ ? "

" మా అన్నయ్యకి. "

" పద ! నేనూ వొస్తాను. ఏ రూమ్‌లో ? "

" అదిగో ఆ రెండో నెంబరు గదిలో. మీరు రూమ్‌లో వుండండి. నే నిప్పుడే రెండు నిమిషాల్లో వొచ్చేస్తాను పెద్ద డాక్టర్ గారితో ఒక్కమాట మాట్లాడి " హడావిడిగా వెళ్ళిపోయాడు శేఖర్.

*

మంచమ్మీద మనోహర్ కొద్దిగా అటూ, యిటూ కదిలాడు.

నెమ్మదిగా కనురెప్పలు తెరుచుకున్నాయి.

ఎదురుగా నిలబడ్డ రాధారాణిని చూస్తూనే యెన్నో భావాలు, మరెన్నో ప్రశ్నలు ఆ కళ్ళల్లో కదలాడాయి.

" నువ్వు.... నువ్వు.... రాధవి కదూ ! రాధవేనా ? " నీరసాన్ని, అనారోగ్యాన్నీ మించిన ఆనందంతో అతని మాట తడిబడిపోయింది.

కళ్ళనీళ్ళతో తల ఊగించింది. " ఔను మనో నేనే రాధని. "

" నాకు తెల్సు, నాకు తెల్సు నువ్వొస్తావని. నువ్వెక్కడున్నా నా ఈ చివరి క్షణాల్లో ఆ భగవంతుడు నిన్ను నా దగ్గరికి తీసుకొస్తాడని నేను నమ్మాను. దేవుడు దయదలిచాడు. నువ్వు హాస్యంగా అన్నా నేను భరించలేను రాధా. చెప్పు రాధా నిజం చెప్పు. నన్ను ప్రేమించానని ఒక్క ముక్క చెప్పు చాలు. తృప్తిగా కన్నుమూస్తాను. "

" మనో...." మానసికంగా నలిగిపోయిన రాధారాణి మంచం దగ్గర మోకాళ్ళమీద కూర్చుండిపోయింది.

" చెప్పు రాధా....చెప్పు....నన్ను ప్రేమించానని ఒక్కమాట చెప్పు చాలు. ఆ తృప్తి చాలు నాకు. లేకపోతే నా ఆత్మకి శాంతి వుండదు రాధా...." నీరసంగా, నిస్సత్తువగా చెయ్యి జాపాడు మనోహర్.

అతి మృదువుగా, ఆప్యాయంగా ఆ చేయి నందుకుంది రాధారాణి. ఆ చేయి చల్లబడిపోతున్నట్టు అనుమానం తోచింది.

భయంతో, బాధతో విలవిల్లాడిన మనసు తొందరపెట్టింది. "ఫర్వాలేదు. అతని ఆత్మశాంతికోసం నువ్వు అబద్ధం చెప్పినా తప్పులేదు. చెప్పు అతనికొకావల్సినట్టుగ చెప్పి తృప్తి కలిగించు."

"ఒక్క ముక్క చెప్పు రాధా. ఒక్కసారి చెప్పు చాలు. చాలు" మనోహర్ కళ్ళు మూతలుపడుతున్నాయి.

---

"ఔను మనో నిన్ను ప్రేమించాన్నేను. నిన్ను ప్రేమించాను. నిజం" రాధారాణి చెంపలమీద కన్నీరు ధార కట్టింది.

అప్పుడే గదిలో అడుగుపెట్టిన శేషగిరి అక్కడ భార్యనిచూసి తెల్లబోయాడు. భార్య అన్నమాటలు వినపడి అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

—0₀0—